సాక్షి
హనుమకొండ

శుక్రవారం । 23 । మే । 2025



విత్తన షాపుల్లో తనిఖీలు - 8లో

వరంగల్ నగరంలోని ఎరువులు, విత్తన దుకాణాల్లో పోలీసులు, సంబంధిత శాఖ అ ధికారులు తనిఖీలు నిర్వహించారు. నా సిరకం విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు.



రీవాల్యుయేషన్ పూర్తి

కేయూ పరిధి డిగ్రీ కోర్సుల మొదటి, మూడో ఐదో సెమిస్టర్ పరీక్షల ఫలితాల రీవాల్యుయేషన్ పూర్తయ్యింది. - 8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 36⁰ /26⁰

జిల్లాలో ఉదయం కాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం వేళ పలు ప్రాంతాల్లో వర్షం కురుస్తుంది. సాయంత్రం సమయంలో ఆహ్లాదంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

సీపీని కలిసిన ఏసీపీ నరసింహారావు



వరంగల్ క్రైం: హనుమకొండ డివిజన్ నూతన ఏసీపీగా నరసింహారావు గురువారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. 1995 ఎస్సై బ్యాచ్‌కు చెందిన నరసింహారావు గతంలో హనుమకొండ, జనగామ, నర్సంపేట ఇన్‌స్పెక్టర్‌గా పనిచేశారు.

చైతన్య వైతాళికుడు భాగ్యరెడ్డి వర్మ



హన్మకొండ అర్బన్: దళిత సంక్షేమ కోసం పాఠశాలలు, వివిధ విద్యా సంస్థలు స్థాపించి అందరికీ విద్యను అందించాలనే లక్ష్యంతో హిందూ భవన్‌ను ఏర్పాటు చేసిన చైతన్య వైతాళికుడు భాగ్యరెడ్డి వర్మ అని డీఆర్‌ఓ వైవీ.గణేశ్, డీఆర్డీఓ పీడీ మేన శ్రీను అన్నారు. దళిత ఉద్యమ నేత, వైతాళికుడు మాధురి భాగ్యరెడ్డి వర్మ 137వ జయంతిని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు అధికారులు భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం వర్ధంతి, జయంతిని అధికారికంగా నిర్వహిస్తోందని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎస్సీ వెల్ఫేర్ డీడీ శ్రీలత, షెడ్యూల్డ్ కులాల అధ్యయన కేంద్రం డైరెక్టర్ జగన్‌మోహన్, అనిల్‌కుమార్, కనకరాజు, శ్రీనివాస్, కవిత, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు షురూ

విద్యారణ్యపురి: ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. హనుమకొండ జిల్లాలో 33 పరీక్ష కేంద్రాల్లో తొలిరోజు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిన ప్రథమ సంవత్సరం పరీక్షల్లో మొత్తం 4,137 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా.. 3,732 మంది విద్యార్థులు హాజరయ్యారు. 415 మంది గైర్హాజరైనట్లు డీఐఈఓ గోపాల్ తెలిపారు. మధ్యాహ్నం 2:30 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు జరిగిన ఇంటర్ సెకండియర్ పరీక్షల్లో 1169 మంది విద్యార్థులకుగాను 1023 మంది విద్యార్థులు హాజరుకాగా.. అందులో 146 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. డీఐఈఓ గోపాల్, రాష్ట్ర అబ్జర్వర్లు యాదగిరి, విశ్వేశ్వర్‌రావు పలు పరీక్ష కేంద్రాలను పరిశీలించినట్లు సమాచారం.

వరంగల్ జిల్లాలో ఇద్దరు డీబార్

వరంగల్ జిల్లాలో నిర్వహించిన ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షల్లో 1,272 మందికి 1,188 మంది హాజరుకాగా.. వారిలో 84 మంది గైర్హాజరయ్యారు. ఇంటర్ సెకండియర్ పరీక్షల్లో 465 మంది విద్యార్థులకు 432 మంది హాజరుకాగా.. అందులో 33 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఐఈఓ డాక్టర్ శ్రీధర్‌సుమన్ తెలిపారు. నర్సంపేటలో ఇద్దరు విద్యార్థులు డీబార్ అయినట్లు పేర్కొన్నారు.

పిచ్చికుక్క దాడిలో తొమ్మిది మందికి గాయాలు



ఎల్కతుర్తి: మండల కేంద్రంలో గురువారం పిచ్చికుక్క దాడిలో తొమ్మిది మందికి గాయాలయ్యాయి. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మరికొందరికి తీవ్ర గాయాలు కావడంతో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. మండల కేంద్రానికి చెందిన గోరంట రాజమ్మ, లెలీన, రాజ నర్సయ్య, యాకూబ్, ఇసంపెల్లి అయిలయ్య, జనగాని గణేశ్, తంగళ్లపల్లి ప్రమీల, రోషన్‌కుమార్, గోరంటాల రాజమ్మ గాయపడ్డారు. కాగా.. పిచ్చికుక్క తొమ్మిది మందిపై దాడి చేయడంతో గ్రామ ప్రజలు అమమత్తంగా ఉండాలని పంచాయతీ సిబ్బంది గ్రామంలో చాటింపు వేయించారు. పిచ్చికుక్కను కొట్టి చంపేయడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.

భూభారతి.. సమస్యల హారతి

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

ఆరు పైలట్ మండలాలనుంచి 19,655 దరఖాస్తులు



ధరణి స్థానంలో రాష్ట్ర ప్రభుత్వం భూభారతి చట్టాన్ని అమల్లోకి తెచ్చింది. ఏప్రిల్ 14న అంబేడ్కర్ జయంతి సందర్భంగా ప్రారంభించిన ఈ పథకాన్ని ప్రయోగాత్మకంగా రాష్ట్రంలోని నాలుగు మండలాలను ఎంపిక చేసింది. తర్వాత జిల్లాకు ఒక మండలం చొప్పున ఎంపిక చేసి సదస్సులు నిర్వహించి అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. ఉమ్మడి వరంగల్ ఆరు జిల్లాలకు సంబంధించి.. నడికూడ (హనుమకొండ జిల్లా), వర్ధన్నపేట (వరంగల్), వెంకటాపురం (ములుగు), దంతాలపల్లి (మహబూబాబాద్), స్టేషన్‌ఘన్‌పూర్ (జనగామ), రేగొండ (జేఎస్ భూపాలపల్లి) మండలాలను 'పైలట్'గా ఎంచుకున్నారు. ఆరు మండలాల నుంచి మొత్తం 19,655 దరఖాస్తులు స్వీకరించిన అధికారులు ధరణి పోర్టల్‌లో నిక్షిప్తం చేసేందుకు క్షేత్రస్థాయి పరిశీలన చేస్తున్నారు. భూభారతి సదస్సులు, దరఖాస్తుల స్వీకరణ, క్షేత్ర స్థాయి పరిశీలనలపై 'గ్రౌండ్ రిపోర్ట్'.

సాక్షిప్రతినిధి, వరంగల్

- సదస్సుల ద్వారా అర్జీల స్వీకరణ..
- సాదాబైనామాలకే ప్రాధాన్యం
- ఆతర్వాత అసైన్డ్, వారసత్వ మార్పిడి
- ప్రధానంగా 12 అంశాలపై అర్జీలు
- క్షేత్రస్థాయి పరిశీలనలో అధికారులు

భూభారతి చట్టం ద్వారా భూ సమస్యల పరిష్కారానికి చేపట్టిన సదస్సుల్లో అర్జీలు అధిక సంఖ్యలో వచ్చాయి. ఉమ్మడి వరంగల్‌లో పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన మండలాల్లో ఈనెల 5 నుంచి 18 తేదీల వరకు సదస్సులు నిర్వహించారు. ఈఆరు మండలాల్లోని గ్రామాల నుంచి మొత్తం 19,655 దరఖాస్తులు స్వీకరించినట్లు అధికారులు ప్రకటించారు. ఇందులో ప్రధానంగా అర్జీదారులు సాదాబైనామా, అసైన్డ్, వారసత్వ మార్పిడిలను ఎక్కువగా అడిగారు. భూ విస్తీర్ణంలో తేడాలు, భూములు నిషేధిత జాబితాలోకి ఎక్కడం, భూ హద్దుల సమస్య, పేర్లు సరిచేయడం, సర్వే నంబర్ల మిస్సింగ్ తదితర సమస్యల పరిష్కారం కోసం దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు.

ప్రత్యేక బృందాలు..

కాగా.. 19,655 అర్జీల్లో 8,339 సాదాబైనామా, 3,416 అసైన్డ్, 1,331 వారసత్వ మార్పిడి కోసం దరఖాస్తు చేసుకున్నారు. భూవిస్తీర్ణంలో తేడాల సవరణ కోసం 910 మంది అర్జీ పెట్టుకోగా.. మిగిలిన 5,659 దరఖాస్తులు వివిధ అంశాలపై ఉన్నాయి. పైలట్ మండలాల్లో రెవెన్యూ సదస్సుల్లో రైతులకు అవగాహన కల్పించి దరఖాస్తులు స్వీకరించి రసీదులు అందజేసిన అధికారులు, ఆవివరాలను భూభారతి పోర్టల్ ద్వారా ఆన్లైన్లో నమోదు చేస్తున్నారు. దరఖాస్తుల్ని క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు రెవెన్యూ గ్రామాల వారీగా ఆరు మండలాల్లో 21 ప్రత్యేక బృందాలను నియమించగా.. వారు దరఖాస్తుదారులకు నోటీసులు అందజేసి వారి సమక్షంలోనే సమస్యను పరిష్కరిస్తున్నారు.

అంశాలు, జిల్లాల వారీగా అర్జీల వివరాలు..

అంశాలు	హనుమకొండ	వరంగల్	భూపాలపల్లి	జనగామ	ములుగు	మానుకోట
సాదాబైనామా	1,456	1,415	1,999	422	2,801	246
అసైన్డ్	481	746	1,362	35	732	60
వారసత్వ మార్పిడి	223	192	290	140	430	56
భూ విస్తీర్ణంలో తేడాలు	134	155	338	84	101	101
డీఎస్ పెండింగ్	331	45	247	29	100	20
మ్యుటేషన్‌పెండింగ్	16	33	06	41	20	23
మిస్సింగ్ సర్వే నంబర్లు	08	30	23	05	100	37
ఇనామ్–ఓఆర్‌సీ జారీ	119	28	00	07	01	07
భూ వివరణ	00	22	01	11	203	02
భూ సేకరణ	14	05	08	23	03	29
పేరు సరిచేయుట	21	04	19	11	21	22
నిషేధిత జాబితా నుంచి తొలగించేందుకు	07	01	03	19	24	10
38 –ఈ ధ్రువపత్రం	00	01	00	00	19	00
ఇతర దరఖాస్తులు	88	520	2815	241	00	213

పైలట్ మండలాల వారీగా ఇదీ పరిస్థితి..

- **హనుమకొండ జిల్లా** నడికూడలో రెవెన్యూ సదస్సుల్లో మొత్తం 2,695 అర్జీలు రాగా, సదస్సులు ముగిశాక 203 అర్జీలు తహసీల్దారు కార్యాలయంలో రైతులు అర్జీలు పెట్టుకున్నారు. మొత్తం 2,898 అర్జీల్లో అత్యధికంగా 1,456 సాదాబైనామా, 481 అసైన్డ్ సవరణ, 331 డీఎస్ పెండింగ్, 223 వారసత్వ మార్పిడి కోసం దరఖాస్తులు చేసుకున్నారు. భూవిస్తీర్ణంలో తేడా తదితర అంశాలపై అర్జీలు అందగా.. ఈ దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు రెవెన్యూ గ్రామాల వారీగా నాలుగు బృందాలు పనిచేస్తున్నాయి.
- **వరంగల్ జిల్లాలో** భూభారతి పైలట్ ప్రాజెక్టు కింద ఎంపికైన వర్ధన్నపేట మండలంలో 3,197 దరఖాస్తులు వచ్చాయి. రెవెన్యూ సదస్సుల్లో 2,917 దరఖాస్తులు రాగా.. తహసీల్దార్ కార్యాలయంలో 280 దరఖాస్తులు రైతులు ఇచ్చారు. వీటిలో అత్యధికంగా 1,415 సాదాబైనామాలు రాగా.. ఆతర్వాత అసైన్డ్ భూములకు సంబంధించి 746 దరఖాస్తులు వచ్చాయి. వారసత్వ భూమార్పిడి కోసం ఏకంగా 192 దరఖాస్తులు వచ్చాయి. ఉన్న భూమి కంటే తక్కువ నమోదైనవారు 155 మంది ఉన్నారు.
- **జనగామ జిల్లా** స్టేషన్‌ఘన్‌పూర్ మండలంలో సదస్సులు ముగిసినప్పటికీ దరఖాస్తులు స్వీకరిస్తుండగా.. మొత్తం 1,068 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. సాదాబైనామా మినహా మిగిలిన దరఖాస్తుల్లో 40శాతానికి పైగా.. సమస్యలు పరిష్కారమయ్యాయి. మొత్తంగా భూభారతి చట్టంతో భూసమస్యల పరిష్కారంలో సత్ఫలితాలు వస్తున్నాయని అధికారులు, రైతులు చెబుతున్నారు.
- **ములుగు జిల్లా** వెంకటాపురం మండలంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో 4,555 దరఖాస్తులు వచ్చాయి. గడువు ముగిసినప్పటికీ తహసీల్దార్ కార్యాలయంలో పలువురు వివిధ భూ సమస్యలపై దరఖాస్తులు సమర్పిస్తున్నారు. ఎలాంటి వివాదాలు లేని పట్టా భూముల్లో ఉన్న సమస్యలను 40 శాతానికి పైగా పరిష్కారమయ్యాయి. మొత్తంగా భూభారతి చట్టంతో సత్ఫలితాలు వస్తున్నాయని రైతులు చెబుతున్నారు.
- **జేఎస్ భూపాలపల్లి జిల్లా** రేగొండ మండలంలో ఈనెల 5 నుంచి 13వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. రెవెన్యూ సదస్సుల్లో మొత్తం 7,111 దరఖాస్తులు వచ్చాయి. సాదాబైనామా మినహా మిగిలిన దరఖాస్తుల్లో 30 శాతానికిపైగా సమస్యలు పరిష్కారమయ్యాయి. మొత్తంగా భూభారతి చట్టంతో సత్ఫలితాలు వస్తున్నాయని అధికారులు, రైతులు చెబుతున్నారు.

జిల్లాల వారీగా వచ్చిన దరఖాస్తులు ఇలా..		
హనుమకొండ 2,898	జనగామ 1,068	జేఎస్ భూపాలపల్లి 7,111
వరంగల్ 3,197	ములుగు 4,555	మహబూబాబాద్ 826

20 ఏళ్ల నుంచి ఇప్పటికీ పట్టాకాలేదు..



సర్వేనంబర్ 161లో 1–01 ఎకరం భూమి ఉంది. మా తండ్రి వాటా కింద 20 ఏళ్ల కింద ఇచ్చిన భూమి ఇప్పటికీ నా పేరు మీద పట్టా కాలేదు. రెవెన్యూ అధికారులు మోకా మీదికి రాకుండానే గ్రామ పంచాయతీలో రికార్డులు చూసి గత పహాణీల్లో నీ పేరు లేదు కాబట్టి పట్టా చేయమని చెప్పారు. తాతలిచ్చిన ఆస్తులకే పట్టాలు చేయడం లేదు. గత ప్రభుత్వం ధరణిలో చేయకపోవడం వల్ల భూభారతి చట్టంలో దరఖాస్తు చేసుకున్నా.

– శెట్టి సంపత్, వెంకటాపురం(ఎం)

పాస్ బుక్ కోసం అర్జీ పెట్టుకున్నా..



నాకు రామన్నగూడెం శివారులో 24 గుంటల అసైన్డ్ భూమి ఉంది. గత ప్రభుత్వంలో సర్వే నిర్వహించారు. కానీ, ఇప్పటివరకు పట్టా కాలేదు. భూభారతి సదస్సులో పట్టా పాస్ పుస్తకం కోసం దరఖాస్తు చేశా.

– జంగేటి సంజీవ్, రామన్నగూడెం, రేగొండ మండలం

వారసత్వ భూమి పట్టా కోసం అర్జీ పెట్టినం..



జాలుబావుల్లో సర్వేనంబర్ 58, 67, 68లో రెండెకరాల 10 గుంటలు చెలుకనా పేరు, మా అన్న కొండ లింగయ్య పేర్లపై పట్టా కావాల్సి ఉంది. గత ప్రభుత్వంలో అర్జీలు పెట్టుకున్నా ఫలితం లేకుండాపోయింది. అప్పుడు ధరణిలో చేయకపోవడం వల్ల భూభారతి చట్టంలో దరఖాస్తు చేసుకున్నం. మా తాత వారసత్వంతో పాటు కొన్న భూమి కూడా ఉంది.

– కొండ భూపాల్, రైతు, దంతాలపల్లి

భూభారతితో సత్వర పరిష్కారం..



భూభారతి చట్టంతో భూసంబంధిత సమస్యలు త్వరగా పరిష్కారమయ్యే అయ్యే అవకాశాలు ఉన్నాయి. వచ్చిన దరఖాస్తుల్లో ఇప్పటికే నలభై శాతానికి పైగా పరిష్కరించాం. కలెక్టర్ ఆదేశాల మేరకు భూభారతి దరఖాస్తులపై ప్రత్యేక చొరవతో పనిచేస్తున్నాం. మొదట పైలట్‌ప్రాజెక్టుగా స్టేషన్‌ఘన్‌పూర్ మండలంలో పూర్తి చేస్తున్నాం.

– వెంకటేశ్వర్లు, తహసీల్దార్, స్టేషన్‌ఘన్‌పూర్

అత్యాధునిక సౌకర్యాలతో రైల్వేస్టేషన్లు..



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, చిత్రంలో కేంద్రమంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ, ఎంపీలు ఈటల రాజేందర్, డీకే అరుణ, కావ్య, మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, ఎమ్మెల్సీ సారయ్య, ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, మేయర్ సుధారాణి

- కేంద్ర భారీ ఉక్కు పరిశ్రమలశాఖ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ
- వరంగల్ రైల్వేస్టేషన్‌ను వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని మోదీ

అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా రూ.25.41కోట్ల వ్యయంతో పునరాభివృద్ధి చేసిన వరంగల్ రైల్వేస్టేషన్‌ను గురువారం రాజస్థాన్‌లోని బికనీర్ నుంచి ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. ఈసందర్భంగా రైల్వేస్టేషన్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేంద్ర భారీ ఉక్కు పరిశ్రమలశాఖ మంత్రి భూపతి రాజు శ్రీనివాసవర్మతోపాటు రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీలు, ఎమ్మెల్యేలు హాజరయ్యారు.

– వివరాలు 8లో – ఖిలా వరంగల్

ముంపునకు గురికాకుండా చర్యలు చేపట్టండి

క్షేత్రస్థాయిలో మేయర్, ఎమ్మెల్యే, కమిషనర్ పర్యటన




సమస్యలపై చర్చిస్తున్న మేయర్ సుధారాణి, ఎమ్మెల్యే నాగరాజు, కమిషనర్ అశ్విని తానాజీ

హసన్‌పర్తి: వర్షాకాలంలో కాలనీలు ముంపునకు గురవకుండా ఉండేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలని మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు, కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఆదేశించారు. 55, 56వ డివిజన్లలోని జవహర్ కాలనీ, పోచమ్మ గుడి, గోపాలపురం చెరువు, నక్షత్ర కాలనీ ప్రాంతాల్లో వారు పర్యటించారు. నాలాల్లో చేపట్టనున్న పూడిక పనుల ప్రక్రియను పరిశీలించారు. వడ్డేపల్లి మత్తడి నుంచి వచ్చే నాలా జవహర్‌నగర్ వద్ద ముంపునకు గురవకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. స్థానికుల కోరిక మేరకు గోపాలపురం చెరువును శుభ్రం చేసి ఓపెన్ జిమ్ ఏర్పాటు చేస్తామన్నారు.

త్వరలోనే వడ్రా..

హైడ్రా తరహాలో ఇక్కడ వడ్రా అమలు చేయనున్నట్లు ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు తెలిపారు. శిఖం, బఫర్ జోన్లలో నిర్మాణాలు చేపట్టినా కూల్చివేస్తామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సిరంగి సునీల్ కుమార్, జక్కుల రజిత, మాజీ కార్పొరేటర్ వెంకటేశ్వర్లు, డివిజన్ అధ్యక్షుడు కొంక హరిబాబు, గడ్డం శివరాం, మణీంధర్‌నాథ్, సీఎంహెచ్‌ఓ రాజారెడ్డి, ఇన్‌చార్జ్ ఎస్‌ఈ శ్రీనివాస్, ఈఈ రవికుమార్, సంతోశ్‌బాబు, డీఈలు రవికిరణ్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కమిషనరేట్‌కు అధికారులు



వరంగల్ క్రైం: రాష్ట్రవ్యాప్తంగా పోలీస్‌శాఖలో జరిగిన బదిలీల్లో వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు ఇద్దరు, భూపాలపల్లికి ఒకరు వచ్చారు. రాష్ట్ర డీజీపీ డాక్టర్ జితేందర్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. ఖమ్మం అడిషనల్ డీసీపీగా పనిచేస్తున్న ఏ.నరేశ్‌కుమార్ భూపాపల్లి అడిషనల్ ఎస్పీగా, భూపాలపల్లి జిల్లా అడిషనల్ ఎస్పీ బోనాల కిషన్‌ను వరంగల్ కమిషనరేట్ అడిషనల్ డీసీపీగా (ఆపరేషన్ అండ్ క్రైం), ఆసిఫాబాద్‌లో అడిషనల్ ఎస్పీగా విధులు నిర్వహిస్తున్న రాయల్‌ప్రభాకర్‌రావును వరంగల్ కమిషనరేట్ అడిషనల్ డీసీపీ (లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్)కు బదిలీ చేశారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలి

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి



ఉపాధ్యాయులతో ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి

ఆత్మకూరు: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిళి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీ హై స్కూల్‌లో జరుగుతున్న ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమానికి గురువారం ఆయన హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల అభ్యసన స్థాయిలను పెంచి గుణాత్మక విద్యను అందించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచడానికి కృషి చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెరగడానికి సమాజంలోని అన్ని వర్గాల సహకారం తీసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందనే విషయాన్ని ప్రజలకు విస్తృతంగా తెలియపర్చాలని కోరారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఎల్లవేళలా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్ విజయ్‌కుమార్, ఉపాధ్యాయ సంఘం నాయకులు తిరుపతిరెడ్డి, బుచ్చిరెడ్డి, ఉపేందర్‌రెడ్డి, లక్ష్మణ్‌రావు, రాజు, సుధాకర్ పాల్గొన్నారు.

ప్రాణహిత పరవళ్లు.. కాళేశ్వరం విరాజిల్లు!

మేఘం నీళ్లను కుమ్మరించినా.. ఈదురుగాలి చల్లగా పలకరించినా.. నేల చిత్తడిగా మారినా.. భక్తుల నిష్ఠ చెక్కుచెదరలేదు. రాష్ట్రాలు దాటి వచ్చిన వారు కొందరైతే.. గంటలకు గంటలు ప్రయాణించి వచ్చిన వారు ఇంకొందరు. భక్తజనులతో కాళేశ్వరాలయం, నదీ పరిసరాలు కిక్కిరిశాయి. పుణ్యస్నానమాచరించిన అనంతరం గోదావరికి ప్రత్యేక పూజలు చేశారు. కాళేశ్వరముక్తీశ్వరుణ్ని దర్శించుకునేందుకు పోటెత్తారు. గురువారం సుమారు లక్షమందికి పైగా భక్తులు వచ్చినట్లు అధికారులు అంచనా వేశారు.

– మరిన్ని ఫొటోలు 8లో





నీటిని వదులుతూ..



పుష్కర స్నానం ఆచరించేందుకు వస్తున్న భక్తులు



పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

భక్తికి రూపం హనుమంతుడు

వేయిస్తంభాల దేవాలయంలో ఘనంగా హనుమాన్ జయంతి



పంచముఖ ఆంజనేయస్వామికి ఉత్సవ విగ్రహానికి అభిషేకం చేస్తున్న గంగు ఉపేంద్రశర్మ

హన్మకొండ కల్చరల్: భగవంతుడి భక్తికి రూపం హనుమంతుడని, చిన్నాపెద్దా భక్తితో అతడిని కొలుస్తారని వేయిస్తంభాల దేవాలయం ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ అన్నారు. రుద్రేశ్వర స్వామి వారి వేయిస్తంభాల ఆలయంలో హనుమాన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. గురువారం ఉదయం నుంచి ఆలయ ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో వేద పండితులు మణికంఠశర్మ, సందీప్ శర్మ, ప్రణవ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం యాగశాలలో వేదపండితులు హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. సీఎంఆర్ షాపింగ్‌మాల్ అధినేత వెంకటరమణ, భరత్‌భూషణ్ దంపతుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య రాష్ట్ర మహాసభ ఉపాధ్యక్షుడు గట్టు మహేశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు. ఆలయ ఈఓ అనిల్‌కుమార్ పర్యవేక్షించారు.

పులకించిన పుష్కరిణి..


నదికి మొక్కుతున్న హనుమాన్ మాలధారులు



నదిలో పూజలు చేస్తున్న భక్తులు


నదికి నవరత్నమాల హారతి ఇస్తున్న పండితులు


ఎంపీ ఈటల రాజేందర్‌కు స్వాగతం పలుకుతున్న అర్చకులు


నదిలో దీపం వదులుతున్న యువతులు


జలాకాలటలో యువతి


నదిలో దీపంతో నమస్కరిస్తున్న యువతి


పుష్కరఘాట్ వద్ద భక్తుల సందడి


నదికి పూజలు చేస్తూ..


ఎడ్లబండ్లలో పుష్కరస్నానానికి వెళ్తున్న భక్తులు


దీపంతో యువతి..

అంచెలంచెలుగా ఎదిగి.. నేలకొరిగి

- విద్యార్థి దశ నుంచే.. విప్లవ భావాలు
- 2016లోనే అడవిబాట
- 2017లో ఐదుగురిపై రెక్కీ
- ముగిసిన రాకేశ్ ప్రస్థానం


రాకేశ్(ఫైల్)

హసన్‌పర్తి: విద్యార్థి దశ నుంచే విప్లవ భావాలు. పీజీ పూర్తిచేశాక నేరుగా మావోయిస్టు పార్టీకి ఆకర్షితుడై అందులో చేరారు. తొమ్మిదేళ్ల పాటు పార్టీలో పనిచేసి అంచెలంచెలుగా ఎదిగిన బూర రాకేశ్ చివరికి ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో నేలకొరిగాడు. ఈ ఎన్‌కౌంటర్‌లో మావోయిస్ట్ అగ్రనేత సంబాల కేశవరావు అలియాస్ బసవరాజుతోపాటు 26 మంది కాల్పుల్లో మృతి చెందారు. ఇందులో హసన్‌పర్తి మండలం చింతగట్టుకు చెందిన బూర రాకేశ్ అలియాస్ వివేక్ ఉన్నట్లు ఛత్తీస్‌గఢ్ పోలీసులు ప్రకటించారు. హసన్‌పర్తి మండలం చింతగట్టుకు చెందిన రాకేశ్‌ది నిరుపేద కుటుంబం. తల్లిదండ్రులు సరోజన-బాబు. తండ్రి ట్రాక్టర్ డ్రైవర్. తల్లి కూలీ. సోదరుడు రంజిత్‌కుమార్ ఆటోడ్రైవర్. రాకేశ్ బాల్యం చింతగట్టులోనే గడిచింది. 2009లో చింతగట్టు పాఠశాలలో పదో తరగతి పూర్తి చేశాడు. ఈతర్వాత నగరంలోని స్నేహా కళాశాలలో (2009–11) ఇంటర్ పూర్తి చేశాడు. 2011–14 వరకు నగరంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ చదివాడు. ఆతర్వాత నగరంలోని ఓ కళాశాలలో పీజీ పూర్తి చేశాడు.

2016లో అడవిలోకి..

మావోయిస్టు పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితుడై 2016లో అజ్ఞాతంలోకి వెళ్లాడు. మరుసటి ఏడాది అప్పటి కార్పొరేటర్లు కాయిత సమ్మిరెడ్డి, దాస్యం విజయ్‌భాస్కర్, ప్రస్తుత హసన్‌పర్తి పీఏసీఎస్ చైర్మన్ ఉదయ్‌కుమార్‌రెడ్డి, హసన్‌పర్తి మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు బండా రత్నాకర్‌రెడ్డి, పెగడపల్లి మాజీ సర్పంచ్ నరేడ్ల శ్రీధర్‌ను హతమార్చేందుకు రెక్కీ నిర్వహించాడు. ఇంట్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం వల్ల ఉదయ్‌కుమార్‌రెడ్డి తప్పించుకున్నారు. అజ్ఞాతంలో ఉన్నప్పటికీ ఓసారి చింతగట్టుకు వచ్చినట్లు ప్రచారం జరిగింది. తొమ్మిదేళ్ల క్రితమే అజ్ఞాతంలోకి వెళ్లిన రాకేశ్ అంచెలంచెలుగా ఎదుగుతూ అగ్రనేతకు కంప్యూటర్ ఆపరేటర్‌గా వ్యవహరించాడు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

- వర్ధన్నపేట ఏడీఏ నరసింగం, ఖిలా వరంగల్ ఏఓ రవీందర్‌రెడ్డి

ఖిలా వరంగల్: నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వర్ధన్నపేట ఏడీఏ నరసింగం, ఖిలా వరంగల్ మండల వ్యవసాయధికారి రవీందర్‌రెడ్డి హెచ్చరించారు. వరంగల్ స్టేషన్ రోడ్డు, ఫోర్ట్ రోడ్డులోని ఎరువులు, విత్తన దుకాణాల్లో వ్యవసాయ, పోలీసు శాఖ అధికారులు గురువారం 25 షాపులను తనిఖీ చేసి రికార్డులు, విత్తనాల విక్రయాలు, అనుమతి, కంపెనీ గుర్తింపు వివరాలు తెలుసుకున్నారు. గాయత్రి, అరుంధతి సీడ్స్ అండ్ పెస్టిసైడ్స్ షాపులను తనిఖీ చేశారు. స్టేషన్‌రోడ్డులోని ఓ షాపు నిర్వాహకులు కళాష్ సీడ్స్ కంపెనీ వారి విత్తన లైసెన్స్ రెన్యువల్ కాపీని అధికారులకు చూపించలేదు. దీంతో రూ.6,85,980 విలువైన 580 పత్తి, మిర్చి ప్యాకెట్ల విక్రయాలను నిలిపివేయించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ నకిలీ, విడి విత్తనాలు కొనుగోలు చేసి మోసపోవద్దని, లైసెన్స్ ఉన్న షాపులోనే విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. పంట ముగిసే వరకు విత్తన బిల్లులను భద్రపర్చుకోవాలన్నారు. పంట దిగుబడి రాకుంటే నష్టపరిహారం పొందే అవకాశం ఉందని వివరించారు. తనిఖీల్లో వ్యవసాయ శాఖ అధికారులు యాకయ్య, విజయ్, హెడ్‌కానిస్టేబుల్ కరుణాకర్, సిబ్బంది పాల్గొన్నారు.


తనిఖీ చేస్తున్న అధికారులు

అత్యాధునిక సౌకర్యాలతో రైల్వేస్టేషన్లు

- కేంద్ర భారీ ఉక్కు పరిశ్రమల శాఖ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ
- వరంగల్ రైల్వేస్టేషన్‌ను వర్చువల్‌గా పునఃప్రారంభించిన ప్రధాని మోదీ
- హాజరైన రాష్ట్ర మంత్రి పొంగులేటి, ఎంపీలు, ఎమ్మెల్యేలు
- వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంస పత్రాల ప్రదానం


సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర భారీ ఉక్కు పరిశ్రమల శాఖ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, పక్కన శాసనమండలి డిప్యూటీ చైర్మన్ ప్రకాశ్, ఎంపీలు ఈటల, డీకే అరుణ, కావ్య, ఎమ్మెల్యేలు

ఖిలా వరంగల్: ప్రధానిగా నరేంద్ర మోదీ బాధ్యతలు స్వీకరించినప్పటినుంచి ఇతర దేశాలతో పోటీ పడే విధంగా రైల్వేస్టేషన్లలో అంతర్జాతీయ ప్రమాణాలతో సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నట్లు కేంద్ర భారీ ఉక్కు పరిశ్రమలశాఖ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ తెలిపారు. అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా రూ.25.41 కోట్ల వ్యయంతో పునరాభివృద్ధి చేసిన వరంగల్ రైల్వేస్టేషన్‌ను గురువారం రాజస్థాన్‌లోని బికినీర్ నుంచి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వర్చువల్‌గా పునఃప్రారంభించారు. ఈసందర్భంగా వరంగల్ రైల్వేస్టేషన్ ప్రాంగణంలో రైల్వేశాఖ దక్షిణమధ్య రైల్వే అడిషనల్ జనరల్ మేనేజర్ నీరజ్ అగర్వాల్ అధ్యక్షతన ప్రారంభోత్సవ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కేంద్ర భారీ ఉక్కు పరిశ్రమల శాఖ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ హాజరై మాట్లాడారు. అత్యాధునిక, సాంకేతిక పరిజ్ఞానంతో అమృత్ భారత్ పథకంలో స్టేషన్లు అభివృద్ధి చెందాయన్నారు. రూ.25 కోట్లతో కాజీపేట రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనులకు జరుగుతున్నాయని, కోచ్ ఫ్యాక్టరీ, ట్రైబల్ యూనివర్సిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అత్యాధునిక హంగులతో రానున్న 30 సంవత్సరాల్లో రైల్వేలను ఆధునికీకరించే విధానంలో వృద్ధులు, దివ్యాంగులకు టాయిలెట్స్, వెయిటింగ్ రూమ్స్, ఎస్కలేటర్స్, ఫుట్‌ఓవర్ బ్రిడ్జి, లిఫ్టులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో బుల్లెట్ రైలు తీసుకురావడానికి భారత ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మామునూరు ఎయిర్‌పోర్ట్ రన్‌వే విస్తరణ కోసం భూమిని కేటాయించిన వెంటనే పనులు ప్రారంభిస్తామని స్పష్టం చేశారు.

కళావైభవం ఉట్టిపడేలా స్టేషన్ : శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్

అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా రూ.25.41 కోట్ల వ్యయంతో కాకతీయ కళావైభవం ఉట్టిపడేలా వరంగల్ రైల్వే స్టేషన్‌ను తీర్చిద్దిదడం సంతోషకరమన్నారు. రాష్ట్రంలో 40 రైల్వే స్టేషన్లకు మాత్రమే కాకుండా అన్ని స్టేషన్లను అమృత్ భారత్ పథకంలో భాగంగా అభివృద్ధి చేయాలని కోరారు.



స్టేషన్ల ఆధునికీకరణ అభినందనీయం: మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

రాష్ట్రంలోని బేగంపేట, వరంగల్, కరీంనగర్ రైల్వేస్టేషన్లను ఆధునికీకరించి ప్రారంభించినందుకు ప్రధాని మోదీకి రాష్ట్రం తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ప్రపంచంలోనే హైదరాబాద్ ఎలా అభివృద్ధి చెందిందో అదే విధంగానే వరంగల్ నగరం అభివృద్ధి సాధించాలని అన్నారు. ఉత్తర, దక్షిణ భారతాన్ని కలుపుతున్న కాజీపేట జంక్షన్‌ను డివిజన్‌గా ప్రకటించాల్సిన అవసరం ఉందని అన్నారు.

రూ.425 కోట్లతో చర్లపల్లి నిర్మాణం : ఎంపీ ఈటల రాజేందర్


ప్రధాని మోదీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాల్లో సమపాళ్లలో అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. రూ.425 కోట్ల వ్యయంతో చర్లపల్లి టర్మినల్‌ను అత్యాధునిక హంగులతో నిర్మించినట్లు తెలిపారు.

కాజీపేటను రైల్వే డివిజన్‌గా ప్రకటించాలి: ఎంపీ కడియం కావ్య

కాకతీయుల కళలు ప్రతిబింబించేలా వరంగల్ రైల్వేస్టేషన్ నిర్మించడం అభినందనీయమన్నారు. అమృత్ భారత్ పథకం కింద కాజీపేట రైల్వేస్టేషన్ పునరుద్ధరణ పనులు కొనసాగుతున్నాయని, త్వరలో ప్రారంభించుకుంటామన్నారు. కాజీపేట రైల్వే డివిజన్‌గా ప్రకటించాలని, రైల్వేశాఖ ద్వారా బస్‌స్టేషన్ నిర్మించాలని కోరారు.

103 స్టేషన్లు దేశానికి అంకితం: ఎంపీ డీకే అరుణ

అమృత్ భారత్ పథకం కింద దేశవ్యాప్తంగా 103 స్టేషన్లను మౌలిక సదుపాయాలు, సకల సౌకర్యాలు కల్పించి ప్రధాని చేతుల మీదుగా వర్చువల్‌గా ప్రారంభించుకొని దేశానికి అంకితం చేసినట్లు తెలిపారు.


నృత్యం చేస్తున్న కళాకారులు

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

వరంగల్ రైల్వేస్టేషన్ ప్రారంభోత్సవంలో ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక నృత్యాలు ఆకట్టుకున్నాయి. భద్రకాళి అమ్మవారి గీతం, సిందూర్ ప్రత్యేక గీతానికి సైనిక దుస్తుల్లో కళాకారులు చేసిన నృత్యాలు అలరించాయి.

శిలాఫలకాన్ని ఆవిష్కరించిన కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ

వరంగల్ రైల్వేస్టేషన్‌ను గురువారం రాజస్థాన్‌లోని బికినీర్ నుంచి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వర్చువల్‌గా పునఃప్రారంభించగా.. కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం రైల్వే అధికారులు ఇటీవల నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ ప్రశంసాపత్రాలను అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ సారయ్య, ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, నాయిని రాజేందర్ రెడ్డి, యశస్విని రెడ్డి, కలెక్టర్ సత్యశారద, బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు, వన్నాల శ్రీరాములు, ప్రేమేందర్‌రెడ్డి, మాజీ మేయర్ రాజేశ్వర్‌రావు, బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, స్థానిక కార్పొరేటర్ చింతకాల అనిల్, రైల్వే అధికారులు పాల్గొన్నారు.

ఝాన్సీరెడ్డికి హైకోర్టు నోటీసులు


నోటీసులు అందుకున్న ఝాన్సీరెడ్డి దంపతులు

పాలకుర్తి: ఫెమా నిబంధనలు ఉల్లంఘించి భూములు కొనుగోలు చేసిందనే కారణంతో పాలకుర్తి కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డికి హైకోర్టు షోకాజ్ నోటీసు జారీ చేసింది. 2017లో పాలకుర్తి నియోజకవర్గంలోని తొర్రూరు మండలం గుర్తూరు గ్రామంలో ఝాన్సీరెడ్డి, డాక్టర్ రాజేందర్‌రెడ్డి దంపతులు 75 ఎకరాల వ్యవసాయ భూమిని కొనుగోలు చేశారు. అమెరికా పౌరసత్వం కలిగిన ఝాన్సీరెడ్డి స్వదేశంలో భూమి ఎలా కొనుగోలు చేస్తుందంటూ వర్ధన్నపేట మండలం ఇల్లందకు చెందిన దామోదర్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ఈ నెల 1న హైకోర్టులో జడ్జి సీవీ భాస్కర్‌రెడ్డి నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. దీనిపై జూన్ 19 లోపు వివరణ ఇవ్వాలని ఝాన్సీరెడ్డి, డాక్టర్ రాజేందర్‌రెడ్డి దంపతులకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. వీరితోపాటు రెవెన్యూ అధికారుల వివరణ కోరింది. గుర్తూరులో కొనుగోలు చేసిన 75 ఎకరాల భూమిలో ఝాన్సీరెడ్డి దంపతులు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేయనున్నారు. ఈ సెంటర్ నిర్మాణానికి ఇప్పటికే శంకుస్థాపన పూర్తి చేసి పనులకు శ్రీకారం చుడుతున్న తరుణంలో హైకోర్టు నోటీసులు జారీ చేయడం చర్చనీయాంశంగా మారింది. పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి.. ఝాన్సీరెడ్డికి కోడలు కావడం గమనార్హం.

డిగ్రీ సెమిస్టర్ రీ వాల్యుయేషన్ పూర్తి

- ఒకటి రెండురోజుల్లో ఫలితాలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాలో డిగ్రీ కోర్సుల బీఏ, బీకాం, బీబీఏ, బీఎస్సీ తదితర కోర్సుల మొదటి, మూడో, ఐదో సెమిస్టర్ పరీక్షల ఫలితాలను పరీక్షల విభాగం అధికారులు ఈ ఏడాది మార్చి 4న వెల్లడించిన విషయం తెలిసిందే. అనంతరం అదే నెలలో విద్యార్థుల నుంచి రీవాల్యుయేషన్‌కు పరీక్షల విభాగం అధికారులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించగా.. సుమారు 23 వేల మంది దరఖాస్తు చేసి ఫలితాల కోసం ఎదురుచూస్తున్నారు. ఎట్టకేలకు రీవాల్యూయేషన్ ప్రక్రియ ఇటీవల పూర్తికావడంతో ఒకటి రెండు రోజుల్లో ఫలితాలను వెల్లడించాలనే యోచనలో పరీక్షల విభాగం అధికారులు ఉన్నారు. అయితే రీవాల్యూయేషన్ ఫలితాలు వెల్లడించకుండానే మొదటి, మూడో, ఐదో సెమిస్టర్లకు సంబంధించి బ్యాక్‌లాగ్ సబ్జెక్టులకు పరీక్షలను నిర్వహించేందుకు ఫీజులు వసూలు చేసి, పరీక్షల టైంటేబుల్ వెల్లడించారు. ఈనెల 14 నుంచి డిగ్రీ కోర్సుల 2, 4, 6 సెమిస్టర్ల పరీక్షలతోపాటు 5వ సెమిస్టర్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఆ తర్వాత మొదటి, మూడో సెమిస్టర్ పరీక్షలు కూడా నిర్వహించేందుకు ఇప్పటికే టైం టేబుల్‌ను విడుదల చేశారు. వాస్తవంగా మొదటి, మూడో, ఐదో సెమిస్టర్ పరీక్షలకు సంబంధించి రీవాల్యుయేషన్ ఫలితాలను విడుదల చేస్తే బెనిఫిట్ పొందిన విద్యార్థులు మళ్లీ రాసే అవసరం ఉండదు. అందువలన రీవాల్యుయేషన్ ఫలితాలను విడుదల చేయాలని విద్యార్థులు కోరుతున్నారు.

వరంగల్ ఓపెన్ జైలులో సికా అధికారుల తనిఖీ

ఖిలా వరంగల్: వరంగల్ మామునూరులోని ఓపెన్ జైలును సికా ప్రత్యేక సంస్థ అధికారులు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓపెన్ జైలులో ఉన్న 19 మంది జీవిత ఖైదీలు, సిబ్బందితో కలిసి మొత్తం 40 మంది వరకు ఉన్నారు. సికా సంస్థ అధికారులు తనిఖీ చేసిన సమయంలో ఖైదీల వద్ద 5 సెల్‌ఫోన్లు, బ్లూటూత్, గుట్కాప్యాకెట్లు లభ్యమైనట్లు సమాచారం.

ఇకపై సర్వీసుల మంజూరు వేగవంతం

- హెచ్‌టీ సర్వీసుల మంజూరుకు సింగిల్ విండో విధానం
- టీజీ ఎన్పీడీసీఎల్ వరంగల్, హనుమకొండ సర్కిల్ ఎస్ఈలు

హన్మకొండ: వినియోగదారులకు హెచ్‌టీ 11 కేవీ, 33 కేవీ ఆపై ఓల్టేజీ సర్వీసుల మంజూరు వేగవంతం చేయడానికి సింగిల్ విండో విధానం తీసుకొచ్చామని టీజీ ఎన్పీడీసీఎల్ వరంగల్, హనుమకొండ సర్కిల్ ఎస్ఈలు గౌతంరెడ్డి, మధుసూదన్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హెచ్‌టీ 11 కేవీ, 33 కేవీ ఆపై ఓల్టేజీ సర్వీసుల మంజూరును మరింత సరళీకృతం చేయడానికి హెచ్‌టీ మానిటర్ సెల్‌ను సర్కిల్, కార్పొరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఇందులో భాగంగా 11 కేవీ ఓల్టేజీ దరఖాస్తులు సర్కిల్ ఆఫీస్ ఏడీఈ (కమర్షియల్) మానిటర్ చేస్తారని, అలాగే 33 కేవీ ఓల్టేజీ, ఆపై ఓల్టేజీ దరఖాస్తుల్ని ఎన్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలోని ఏడీఈ (కమర్షియల్) మానిటర్ చేస్తారన్నారు. ఈసింగిల్ విండో కొత్తవిధానంలో వినియోగదారులు ముందుగా టీజీ ఎన్పీడీసీఎల్ వెబ్‌పోర్టల్‌లో అవసరమైన పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అనంతరం కొత్త అప్లికేషన్ నంబర్ (యూఐడీ) ఉత్పన్నమవుతుందని తెలిపారు. ఈ దరఖాస్తులు టీజీ ఎన్పీడీసీఎల్ డాష్ బోర్డులో కనిపిస్తాయని, ఏడీఈ (కమర్షియల్) వీటిని మానిటర్ చేస్తారని వివరించారు. ఈదరఖాస్తులను ఎస్టిమేట్ల కోసం సంబంధిత అధికారులకు పంపుతారని, అధికారులు, సర్కిల్ కార్యాలయం క్షేత్రస్థాయి సిబ్బంది సర్వీస్ మంజూరు కావాల్సిన ప్రాంతానికి చేరుకుని పరిశీలించి ఎస్టిమేట్లు రూపొందించి కార్పొరేట్ కార్యాలయానికి పంపుతారని తెలిపారు. అనంతరం కార్పొరేట్ కార్యాలయం అధికారులు మంజూరు ఇస్తారని వివరించారు. సింగిల్ విండో వ్యవస్థ వల్ల త్వరితగతిన సర్వీసులు మంజూరవుతాయని, ప్రతీసారి కార్యాలయాలకు రాకుండా ట్రాక్ చేసుకునే సౌకర్యం ఉందన్నారు. దరఖాస్తు స్థితిగతులను ఎప్పటికప్పుడు ఎస్ఎంఎస్ రూపంలో దరఖాస్తుదారుడికి సమాచారం చేరవేస్తామన్నారు.